క్లుప్తంగా

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు


ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణంలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ముగిసిన హజరత్ అల్లీసాహెబ్ ఉరుసు


దర్గా వద్ద భక్తుల సందడి

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో హజరత్ అల్లీసాహెబ్ స్వామి ఉరుసు ఘనంగా జరిగింది. శని, ఆదివారాల్లో గంధం, ఉరుసు కార్యక్రమాలు, సోమవారం కిస్తీ కార్యక్రమంతో ఉరుసు మహోత్సవాలు ముగిశాయి. ఉరుసు మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసుకు వివిధ ప్రాంతలనుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

చెరువుకు నీటిని మళ్లించాలి


ఎల్లెల్సీ ఏఈ పరమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండలంలోని దేశాయి చెరువుకు నీటిని మళ్లించి హలహర్వి గ్రామ పరిధిలో సాగు చేసిన వరి పంటకు నీరిచ్చి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గద్దం నారాయణరెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎల్లెల్సీ కార్యాలయంలో ఏఈ పరమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈఏడాది మిరప పంటకు సోకిన తెగుళ్లతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గ్రామ పరిధిలో రైతులు వంద ఎకరాల్లో వరి సాగు చేసుకున్నారని, అయితే చెరువులో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు నష్టపోకుండా దయచూపాలని కోరారు.

వేతనాలు చెల్లించాలి

నందవరం : ఉపాధి పనులు చేసే కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్, మండల కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఈసీ నూర్జహాన్‌కు ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించాలేదన్నారు. అలాగే వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు, తాగునీరు, మెడికల్ కిట్, వేసవి పందిళ్లు వంటి ఏర్పాటు చేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుబడిన ట్రాక్టర్లు

నందవరం: అక్రమంగా ఇసుక తరలింపుపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నదిలో దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎమ్మిగనూరు టౌన్‌కి చెందిన రెండు ట్రాక్టర్ల స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రికార్డులు పరిశీలించి జరిమానాలు విధిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భీమాస్‌లో టీసీఎస్ ల్యాబ్ డిజిటట్ జోన్ ప్రారంభం

ఆదోని రూరల్: ఆదోని–ఆలూరు రహదారిలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా టీసీఎస్ ల్యాబ్ డిజిటల్ జోన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డిల చేతులమీదుగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ విద్యలో భాగంగా డిజిటల్ ల్యాబ్ ఉపయోగాన్ని వివరించారు. ఆధునిక కళాశాలలో కంప్యూటర్‌లో కొత్త ఆవిష్కరణ గురించి తెలియజేశారు.

రామలింగేశ్వరుడి దర్శనం..

సర్వ పాపహరణం


- దక్షిణ కాశీగా గురజాల క్షేత్రం ప్రసిద్ధి
- మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు
- రేపటి నుంచి రామలింగేశ్వరుడి మహోత్సవాలు
- 27న ఆదిదంపతుల మహారథోత్సవం

నందవరం : పవిత్ర శైవక్షేత్రాల్లో గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచింది. తుంగభద్రనది తీరంలో అరుదైన శివలింగ సముదాయంతో వెలసిన ఈ పుణ్య క్షేత్రం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి శివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ గావించనున్నారు.

పంచ శివలింగాలు..

తుంగభద్ర నది తీరంలో వెలసిన గురజాల రామలింగేశ్వరుడి దర్శనం చేసుకుంటే సకల పాపలు తొలగిపోతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. మహాభారతం, రామాయణ ఇతిహాసాల్లో ఈ క్షేత్రం ప్రస్తావన ఉంది. ఆలయంలో ప్రతిష్ఠించిన పంచ శివలింగాలు దక్షిణ భారత దేశంలో మరెక్కడా కనిపించవు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేస్తూ ఈ ప్రాంతంలో ప్రతిష్ఠించిన సైకత లింగం శివుడి మహత్వపూర్ణ రూపానికి దర్పణం పట్టుతోంది. ఆంజనేయ స్వామి ప్రతిష్ఠించిన కాశి లింగం భక్తుల వరప్రదాయినిగా అలరారుతోంది. మహాభారతంలో పాండవరాజులలో అగ్రజుడైన ధర్మరాజు ప్రతిష్ఠించిన లింగం ధర్మలింగం. యోధుడిగా పేరు గాంచిన భీమసేనుడు ప్రతిష్ఠించిన భీమలింగం, పాండవ మధ్యముడు వీరపరాక్రమ యోధుడు అర్జునుడు ప్రతిష్ఠించిన పార్థివ లింగం ఈ క్షేత్రంలో కలవు. ఐదు శివలింగాలు ఒకే ఆలయంలో దర్శనమివ్వడం భక్తుల మహాభాగ్యం. ఈ లింగాలను దర్శించి పూజిస్తే పాప విమోచన జరుగుతుందని భక్తుల నమ్మకం.


శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగం (రామలింగేశ్వర స్వామి)


ప్రత్యేక అలంకరణలో పార్వతీ దేవి అమ్మవారు

గురజాల క్షేత్రం

భక్తులకు ఏర్పాట్లు

నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఈవో రాం ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. క్షేత్రం సందర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తుంగభద్ర నదీతీరంలో పుణ్యస్నానాలు, మహిళలకు డ్రస్సింగ్ రూములు, వాహనాల పార్కింగ్, చలువ పందిళ్లు, దర్శన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తుల భద్రత దృష్ట్యా డీఎస్పీ ఉపేంద్ర బాబు నేతృత్వంలో పోలీసుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

తుంగాతీరంలో పుణ్యస్నానాలు

గురజాల క్షేత్రంలో తుంగభద్ర నదిలో నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. పుష్కర ఘాట్ల వద్ద నీటి ప్రవాహం ఉడడంతో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడానికి అనుకులంగా ఉంది. భక్తులు నదిలో పుణ్య స్నానాలు ఆచారించి ఆదిదంపతులు(రామలింగేశ్వరస్వామి, పార్వతీ దేవి)ను దర్శించుకోవచ్చు.

రేపు ప్రభోత్సవం

మహోత్సవాల్లో భాగంగా 26న బుధవారం యాగమంటప ప్రవేశం, గణపతిపూజ, కలశ స్థాపన, ధ్వజారోహణ, శతరుద్రాభిషేకం క్షీరాభిషేకం, సాయంత్రం ప్రభోత్సవం ఉంటుంది. రాత్రి 2 గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం రమణీయంగా నిర్వహించనున్నారు. జాగారణ నిమిత్తం భక్తులు వేలాదిగా క్షేత్రంలో రాత్రంతా గడుపుతారు. 27వ తేదీ గురువారం చతుర్దశి మహా రుద్రాభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఆదిపంతులను కొలువుంచి మహారథోత్సవం నిర్వహిస్తారు. 28వ తేదీ శుక్రవారం ప్రత్యేక వాహనంపై పారువేట, రామలింగేశ్వరుడికి అభిషేకం, భక్తులకు అన్నదానం చేపడతారు. మార్చి 1న శనివారం ఉదయం 10.00 గంటలకు పూర్ణాహుతి నిర్వహించి, ఆదిదంపతులకు అభిషేకాలతోపాటు వసంతోత్సవం, వేద పండితులకు సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి.


స్వామి, అమ్మవార్ల మహారథం

26న జాగరణ..

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 26వ తేదీ బుధవారం జాగారణ సందర్భంగా భక్తులకు వినోద కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నటరాజ కళాక్షేత్రం ఎమ్మిగనూరు బృందం చేత కూచిపూడి, భరతనాట్యం. రాత్రి 9 గంటలకు శివగాణమృతం కచేరి, భక్తులు నిర్వహించే నంది కోల సేవ నిర్వహిస్తున్నారు. గ్రామపెద్దల సహాయంతో 28న కబడ్డీ పోటీలు, మార్చి 1వ తేదీ శనివారం రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్


ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమం అని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరావు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతే లక్ష్యం


తుంగభద్ర తీరంలో నీటి ప్రవాహన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం : మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తుల భద్రతే లక్ష్యమని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో సీఐ మధుసూదన్‌రావుతో కలిసి మహా శివరాత్రి సందర్భంగా గురజాల రామలింగేశ్వరస్వామి సన్నిధానంలో భక్తుల భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు పనులు చేపట్టాలన్నారు. మహాశివరాత్రి రోజున జాగారం సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు శివారెడ్డి, గ్రామ సర్పంచ్ వీరస్వామి, పూజారి హంపేష్ స్వామి తదితరలు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

బాలికలకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని, బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ శైలజధ్వర్యంలో విద్యార్థినులకు సైబర్ క్రైమ్, విద్యతో వచ్చే విలువలు, బాల్య వివాహాల నిర్మూలనపై డీఎస్పీ అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్ల మాయ మాటలు నమ్మి వ్యక్తిగత సమాచం ఇవ్వద్దొని, ఎవరైనా సైబర్ నేరాల వలన బాధించబడితే వెంటనే 1930 సైబర్ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

నందవరం: అంగన్‌వాడీల్లోని చిన్నారులకు విద్యతో పాటు వారి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా విద్యాబోధన చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి సూచించారు. సోమవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో సమగ్ర శిక్ష, జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలో చిన్నారులకు ఏవిధంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించాలనే అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంఈఓ, డీఆర్‌పీలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, గురుశేఖరమ్మ, సురేఖ, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

శారీరక, మేధాభివృద్ధిపై శిక్షణ

కోసిగి: అంగన్‌వాడీ కేంద్రాలలో బాల్యదశ నుంచే విద్యాభ్యాసం బలోపేతం చేసేలా కృషి చేయాలని ఎంఈఓ – 2 శోభారాణి సూచించారు. సోమవారం స్థానిక కస్తూరీ భా గాంధీ బాలికల పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శారీరక, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, రీసోర్స్‌పర్సన్స్ కె.నరసయ్య, ఎస్. మనోహర్, చిన్న ఈరన్న, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ భాగ్యలక్ష్మీ బాయి, కాత్యాయినిలు శిక్షణ ఇచ్చారు.


అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహిస్తున్న ఎంఈఓ, ఐసీడీఎస్ అధికారులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

ఆదోని టౌన్: మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్‌బాబు, జిల్లా సమితి సభ్యులు కల్లుబావిరాజు మాట్లాడుతూ పట్టణ జనాభాకు అనుకూలంగా కార్మికుల సంఖ్యను పెంచి, పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగన్న, జాన్‌బాబు, శాంత, శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాల అమలులో విఫలం

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కార్మికులతో సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మున్సిపల్ కార్మిక సంఘ నాయకుడు ఎల్లప్ప, ఏఐటీయూసీ తాలూకా, పట్టణ కార్యదర్శులు తిమ్మగుడు, విజయేంద్ర అన్నారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు. నాయకులు శివ, నాగప్ప, విక్రమ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కార్మిక సమస్యలపై పోస్టుకార్డు ఉద్యమం

మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద సీఐటీయూ, ఏపీ మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై కూర్చొని పోస్టుకార్డులను పోస్టుబాక్స్‌లో వేసి నిరసన తెలిపారు. నాయకులు రాముడు, నాగరాజు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నందవరం : బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మండలానికి 50 యూనిట్లు కేటాయించారని, అందులో రూ.91 లక్షలు బీసీ కార్పొరేషన్ కింద రుణాలు మంజూరయ్యాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో మంగళవారం ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వెల్లడించారు.

కౌతాళం: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

గోనెగండ్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సురేంద్రబాబు, మునిస్వామి, మనోహర్, నాగరాజు డిమాండ్ చేశారు. ఆ స్కూల్‌ను సీజ్ చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కుమారస్వామికి ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రం గోనెగండ్లలో స్కూల్‌ను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, బిల్డింగ్ మార్చేంత వరకు తరగతులు ప్రారంభించరాదని డీఈఓ ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. వాటిని బేఖతార్ చేసి పాఠశాలను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాండు, పూర్ణ, రాజు, రాము, పాండు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌతాళం: మండల పరిధిలో విద్యుత్ సరఫరాకు నాలుగు రోజుల పాటు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నర్సప్ప తెలిపారు. కౌతాళంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో లో ఓల్టేజ్ సమస్య అధిగమించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తుండడంతో నాలుగు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. పనులు పూర్తి అయిన వెంటనే నిరంతరాయంగా సరఫరా ఉంటుందన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

ఆదోని సెంట్రల్: క్షయ వ్యాధి నివారణపై కస్తూర్బా గాంధీ(మైనార్టీ) విద్యాలయంలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ అంజిలీ దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ బాబు రాజు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్న, దగ్గులో రక్తపు చారలు, ఆకలి, బరువు వంటివి తగ్గిపోవడం, ఉదయ, సాయంత్రం జ్వరం వంటి లక్షణాలు ఉంటే ఉదయమే రక్త పరీక్ష చేసుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలలు పాటు ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చిట్టిబాయ్, టీబీహెచ్‌వీ సుబ్బమ్మ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ఆదోని సెంట్రల్: కుప్పగల్–కోసిగి ఆర్ఎస్‌ల మధ్య కిలో మీటరు నంబర్ 514/18–20 డౌన్ లైన్ ట్రాక్ వద్ద హరిజన యాకోబు (45)అనే వ్యక్తి గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు సోమవారం తెలిపారు. కోసిగి మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన కప్పన్న కుమారుడిగా గుర్తించినట్లు చెప్పారు. మృతుడి మానసిక స్థితి సరిగా లేదని తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఆదోని రూరల్: మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని నాగనాథనహళ్లి, ఆనవాల్, కుప్పగల్, నౌలేకల్ గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులను పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్ఎస్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపాలని, కుప్పగల్, నౌలేకల్ స్కీం పరిధిలోని గ్రామాలకు అదనపు పైపులైన్ వేయాలని, కనీసం రెండు రోజులకొకసారి తాగునీటి సరఫరా చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సబ్‌కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు వీరారెడ్డి, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు అయ్యప్ప, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్త రోడ్డు వేయండి

కౌతాళం: మండల పరిధిలోని సుళేకేరి గ్రామం నుంచి హాల్వి వరకు ఉన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని లేదా కొత్త రోడ్డు వేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల నాయకుడు ఉలిగయ్య డిమాండు చేశారు. సోమవారం రోడ్డును పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని మారుమూల ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ అధ్వానంగా మారాయని, ప్రధానంగా సుళేకేరి నుంచి హాల్వి వరకు ఉన్న 8 కిలో మీటర్ల రోడ్డుపై ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. వారి వెంట సోమేష్, ఈరన్న పాల్గొన్నారు.


అధ్వానంగా ఉన్న సుళేకేరి–హాల్వి రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

ఘనంగా పెద్దరాజుస్వామి ఉరుసు


గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న పీఠాధిపతి అక్బర్‌బాషా

నందవరం : మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో పెద్దరాజుల ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం పీఠాధిపతి అక్బర్‌బాషా ఖాద్రీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్గాను విద్యుత్ దీపాలతో, పూల మాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం రాత్రి స్వామికి పీఠాధిపతి ఆదివారం గంధం సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. అనంతరం అశ్వాన్ని పూర్వ వీధుల్లో ఊరేగించారు. సోమవారం ఉరుసు ఉత్సవం నిర్వహించారు. ఉరుసు మహోత్సవంలో గ్రామ సర్పంచ్ పావని, ఎంపీటీసీ జైపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్: శ్రీశైలం క్షేత్రంలో దీక్షలో ఉన్న శివస్వామిని చెప్పుతో దాడి చేసి అవమానించిన వ్యక్తిపై శ్రీశైల దేవస్థానం ఈఓ చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఆదోని జిల్లా అధ్యక్షుడు అర్ధగేరి బసవన్నగౌడ్ సోమవారం డిమాండ్ చేశారు. శివదీక్ష తీసుకున్న స్వామిపై విచక్షణా రహితంగా చెప్పుతో దాడి చేసిన ఆ వ్యక్తిపై షాపు లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే హిందూ బంధువులతో పాటు శివదీక్షస్వాములతో అధికారులు ఏవిధంగా ప్రవర్తించాలన్న అంశంపై స్థానికంగా ఉన్న దుకాణదారులకు అవగాహన కల్పించడంలో దేవస్థానం అధికారులు, సంబంధిత అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు.

కిసాన్ సమ్మాన్ నిధి రూ.1.89కోట్లు మంజూరు

పెద్దకడబూరు: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద మండలంలో 9,449 మంది రైతులకు రూ.1.89కోట్లు మంజూరైనట్లు వ్యవసాయధికారి రవిప్రసాద్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో అర్హత కలిగి రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విశిష్ట గుర్తింపు కార్డుకు రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు ఉంటే ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్, పొలం పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

సాగునీటి వాటాలో అన్యాయం

కోసిగి: మాధవరం డిస్ట్రిబ్యూటరీ పరిధిలో ఎల్లెల్సీ సాగునీటి వాటా అందించడంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు అన్యాయం జరుగుతోందని సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు అనంతసేనా రెడ్డి ఆరోపించారు. సోమవారం రైతుల విన్నపం మేరకు కౌతాళం మండలం కామవరం హెడ్ సెక్షన్‌ను, ఎల్లెల్సీ కాల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎల్లెల్సీ సాగునీటి వాటాను ఎమ్మిగనూరు, పెద్దకడబూరు సెక్షన్‌లకు పుష్కలంగా అందిస్తున్నారన్నారు. మాధవరం డిస్ట్రిబ్యూటరీ పరిధిలో ఎల్లెల్సీ వాటా రాకుండా పై ప్రాంతంలోనే నానాయకట్టుదారులు అక్రమంగా అడుగడున పైప్‌లైన్ వేసి నీటిని దోచేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయంపై పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడం లేదని మండి పడ్డారు. కోసిగి మండలంలో ఆయకట్టు దారులకు సాగునీరు అందక వలస పోవాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైన ఇరిగేషన్ అధికారులు ఎల్లెల్సీ కాల్వలను పర్యవేక్షించి మాధవరం సెక్షన్‌కు రావాల్సిన నీటి వాటా సక్రమంగా వచ్చేలా చూడాలన్నారు.


అక్రమ పైప్‌లైన్‌ను తొలగిస్తున్న సాగునీటి సంఘం అధ్యక్షుడు అనంతసేనా రెడ్డి